ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్ మాదిగ



ఎర్రగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోటిక మహేష్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎంఆర్‌పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ నియామక పత్రాన్ని బోటిక్ మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బోటిక మహేష్ మాదిగ మాట్లాడుతూ జిల్లాలో ఎంఆర్‌పీఎస్ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.



సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను కలిసిన ఎర్రగడ్డకు చెందిన నాయకులు

కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు కృషి చేయాలి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు కృషి చేయాలని సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంటా మల్లేష్ ఆధ్వర్యంలో నాయకులు దానం నాగేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దశలవారీగా బూత్‌కమిటీ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అధికమెజారిటీని అందించే విధంగా నాయకులు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డకు చెందిన కాంగ్రెస్ నాయకులు మహ్మద్ సర్దార్, పి.శ్రీనివాస్, కె.రాహుల్, వై.శరత్, గంటా నర్సింగ్ రావు, గంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో పర్యటిస్తున్న వాటర్ వర్క్స్ డీజీఎం వాహబ్ తదితరులు

వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు

ఎర్రగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వాటర్ వర్క్స్ డీజీఎం వాహబ్ అన్నారు. సోమవారం ఆయన ఇతర అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎర్రగడ్డలోని పలు బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను, నాయకులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ప్రేమ్‌నగర్, సుల్తాన్‌నగర్ తదితరబస్తీల్లో మంచినీటి పైపైన్లలో మురుగునీరు సరఫరా అవుతోందని ఎంఐఎం నాయకులు చెప్పారు. తగినచర్యలు తీసుకుంటామని డీజీఎం వాహబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు సాబీర్, ఫెరోస్, ముక్తార్, రహీం, జావేద్ తదితరులు పాల్గొన్నారు.



కోట నీలిమను సత్కరిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు

సనత్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌టీ కాలనీ, సుభాష్ నగర్‌కాలనీ చెందిన బీజేపీ కార్యకర్తలు భారీసంఖ్యలో సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన 80 మంది యువకులను డాక్టర్ కోట నీలిమ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదని హెచ్చరించారు. బీజేపీ నాయకుడు రవి కాంత్‌తోపాటు శ్రీధర్, నరేష్, రోహిత్, రాహుల్ తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ అభివృద్ధి విషయంలో విఫలమయ్యాయి అని అన్నారు.

ఉల్లిపాయల బస్తాల మాటున విత్తనాల రవాణా

రూ.19.20 లక్షల విలువైన పత్తి విత్తనాలు స్వాధీనం



విత్తనాలు ఉన్న ట్రక్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లి లోడు కింద నిషేధిత బీటీ 3 హెచ్‌టీ పత్తి విత్తనాలను రవాణా చేస్తున్న ఇద్దరిని మేడ్చల్ ఎస్ఓటీ, షామీర్‌పేట పోలీసులు కలిసి పట్టుకున్నారు. రూ.19.20 లక్షల విలువైన నిషేధిత విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల బెల్లంపల్లికి చెందిన గడ్డం శ్రీకాంత్(38), గోదావరి ఖనికి చెందిన గోషిక నవీన్‌కుమార్(31) డ్రైవర్లు, వారు మందమర్రికి చెందిన మినీట్రక్ యజమాని పిండి సురేష్ వద్ద పనిచేస్తున్నారు. సురేష్ ఆదేశాల మేరకు పత్తి విత్తనాలను తెచ్చేందుకు ఇద్దరు కర్ణాటక కొప్పలి జిల్లా కుస్తగిరి ప్రాంతానికి వెళ్లారు. అక్కడి ఓ వ్యక్తి నుంచి విత్తనాలు తీసుకున్నారు. అనుమానం రాకుండా ఉండేందుకు ఉల్లిపాయలు కొనుగోలు చేసి వాటిపై ఉంచారు. విత్తనాలు, ఉల్లిపాయలు లోడు చేసుకొని మంచిర్యాల బయలుదేరారు. పక్కా సమాచారంతో షామీర్‌పేట ఆరెంజ్‌బౌల్ రెస్టారెంట్ వద్ద నిఘా పెట్టిన మేడ్చల్ ఎస్ఓటీ, షామీర్‌పేట పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. 1200 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు, 1560 కిలోల ఉల్లిపాయలు, బొలేరో క్యారేజ్ వాహనం రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



విజయలక్ష్మికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

వర్ధమాన గాయనీమణులకు విజయలక్ష్మి స్ఫూర్తి

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వర్ధమాన గాయనీమణులకు సింగింగ్‌స్టార్ విజయలక్ష్మి స్ఫూర్తిగా నిలుస్తారని సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ అన్నారు. శ్రీ మహాలక్ష్మి మెలోడీస్ ఆధ్వర్యంలో గాయని మహాలక్ష్మి సమర్పణలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో మధుర గాయని, కలైమామణి ఎస్.జానకి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ప్రముఖగాయని విజయలక్ష్మికి ఎస్.జానకి పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదాన సభ ఈ సందర్భంగా జరిగింది. పురస్కారం, అవార్డును బహూకరించిన దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. విజయలక్ష్మి గానం ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. కార్యక్రమంలో ఓంకార్‌రాజు, లంక లక్ష్మీనారాయణ, గుదిబండి వెంకటరెడ్డి, వెంకట్‌రావు, మురళీధర్, వినోద్‌గౌడ్, నిర్వాహకుడు సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులు అణిచి వేస్తున్నాయ్

- బతుకుకు భరోసా లేకుండా పోతోంది
- త్వరలో జేఏసీ ఏర్పాటు
- హక్కుల కోసం పోరాడుతాం: గ్రామీణ వైద్యులు



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామీణ వైద్యులు

పంజాగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యుల బతుకుకు భరోసా లేకుండా పోతోందని, 24 గంటలూ ప్రాణాలకు తెగించి స్థానిక ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తోంటే కార్పొరేట్ శక్తులు అణచి వేసే కుట్రలు చేస్తున్నాయని పలువురు గ్రామీణ వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జేఏసీ ఏర్పాటు చేసి, గ్రామీణ వైద్యుల హక్కుల కోసం పోరాడుతామని వారు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన గ్రామీణ వైద్యులు శ్రీనివాస్ రాజ్, అఖిల్‌శాస్త్రి, ఎంఏ రహమాన్, రాజేష్, యాదగిరి, తదితరులు మాట్లాడారు.

సంఘాలు ఎన్నో ఉన్నా తమ హక్కుల కోసం ఎవరూ పనిచేయడం లేదన్నారు. గ్రామీణ వైద్యుల బతుకుకు భరోసా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షల మంది వరకు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు భయాందోళనలతో ఉన్నారన్నారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్‌ఎంసీ)ఫోర్స్ మొత్తం క్లినిక్‌లపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తోందన్నారు. పాము, తేలు కుడితే తాము చికిత్స చేయకుండా వారిదాకా వచ్చే వరకు ఉంటారా? ఫస్ట్ ఎయిడ్ చేయమంటారు. సెలైన్ పెట్టే స్టాండ్, బెంచీలు పెట్టొద్దంటారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నామని, వైఎస్ హయాంలో తమకు శిక్షణ ఇచ్చారు. ఇప్పుడూ అదే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. డీఎంహెచ్ఓ అనుమతి లేకుండా దాడులు చేయకూడదని, ప్రభుత్వం మరో లక్ష మంది వైద్యుల నియామకం చేసినా గ్రామాల్లో ఉండే అవకాశం లేదన్నారు. బీపీ చూసే పరికరం లేకుండా బీపీ ఎలా చూసేదని ప్రశ్నించారు. ఐఎంఏ 24 గంటలూ వైద్య సేవలు అందిస్తే తాము క్లినిక్‌లు మూసేస్తామన్నారు. రైడింగ్ చేసి ఇబ్బందులకు గురిచేస్తూ కేసులు పెడుతున్నారు. దీంతో భయంతో క్లినిక్‌లు తెరవడం లేదన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలను వైద్యం చేయనివ్వరు, ప్రభుత్వ వైద్యులు చేయరు అని అన్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడు కుటుంబ కౌన్సిలర్ అయ్యారని, ఇంటికే వైద్యం, మందులు అందుతున్నాయన్నారు. ప్రైమరీహెల్త్ సెంటర్‌కు వెళ్లితే అక్కడ బీపీ ఆపరేటర్, ఇతర పరికరాలు సక్రమంగా సరిగా పనిచేయని తీరు ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు కాలు విరిగితే కార్పొరేట్ ఆస్పత్రికి, పేదోడికి ప్రభుత్వ ఆస్పత్రిలోనా, అందరికీ ఒకేచోట వైద్యం అందించండన్నారు. తమ సమస్యలపై పోరాటం చేయడానికి, హక్కులు కాపాడుకోవడానికి త్వరలోనే జేఏసీఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన గ్రామీణ వైద్యులు సుమంత్ కుమార్, సురేష్, నరేష్, ఉదయగీత పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు, ఆటోల్లో నిద్రిస్తున్న వారే టార్గెట్

- స్నాచింగ్. దొంగతనాలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్
- రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1,600 నగదు స్వాధీనం



ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసిన నల్లకుంట పోలీసులు

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లు, ఆటోలలో నిద్రిస్తున్న వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను నల్లకుంట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక కత్తి, త్రిషూల్, బ్లేడ్, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నల్లకుంట పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓయూ ఏసీపీ జగన్, నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు, లాలాగూడ సీఐ రమేష్‌గౌడ్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. నగరంలోని బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో నివాసముంటున్న కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్ ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. రాత్రివేళ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లు, ఆటోలలో నిద్రిస్తున్న వ్యక్తులను బెదిరించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, డబ్బులు, వారి వాహనాలను దొంగిలిస్తున్నారు. తద్వారా వచ్చిన డబ్బుతో ఎంజాయ్ చేస్తున్నారు. ఈ నెల 13న ఎస్.నందకుమార్ అనే వ్యక్తి రాయదుర్గంలో గల ఆజుబా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేస్తున్నాడు. రాత్రి ఆయన మద్యం తాగి తన బైక్‌పై వస్తూ మెట్టుగూడ మెట్రో స్టేషన్ వద్దకు రాగానే బైక్ నడపడం వీలుకాకపోవడంతో బస్టాప్‌లో బైక్ పార్కింగ్ చేసి సెల్‌ఫోన్ జేబులో పెట్టుకుని పడుకున్నాడు. కొంత సమయం తర్వాత నిద్రలేవగానే పార్కింగ్ చేసిన యాక్టివా, జేబులో సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 17న తెల్లవారుజామున నాలుగున్నర సమయంలో రమావత్ రాజు అనే వ్యక్తి నల్లకుంట మోడల్ రైతు చికెన్ బజార్ వద్ద ఫుట్‌పాత్‌పై పడుకున్నాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు యాక్టివాపై వచ్చి అతన్ని కత్తితో బెదిరించి అతని వద్ద నుంచి కీ ప్యాడ్, మొబైల్, రూ. 3 వేలు తస్కరించారు. ఆయన నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్ఐ కృష్ణ, క్రైమ్ సిబ్బందితో కలిసి బోరబండలో ముగ్గురు కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్‌లను పట్టుకున్నారు. ఈ ముగ్గురు 3 ఏళ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్నారని ఏసీపీ తెలిపారు. ఇందులో వెంకటస్వామి 16 నెలలు జైలుకు వెళ్లి వచ్చాడని, తిరిగి వచ్చిన వెంటనే దొంగతనాలు, స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడని తెలిపారు. ఎస్‌ఆర్‌నగర్, లాలాగూడ, నల్లకుంట, జీడిమెట్ల, కూకట్‌పల్లి పీఎస్‌ల పరిధిలో ఇలాంటి దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వీరిపై ఆర్మ్‌యాక్ట్ కూడా నమోదు చేశామని తెలిపారు. రాత్రిపూట ఫుట్‌పాత్, బస్టాప్, ఆటోలలో నిద్రించే వారు ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐలు కృష్ణ, శ్రీనివాసరావు, రమాదేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. వీరిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందికి రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ జగన్ ప్రకటించారు.

తెలుగు రాష్ట్రాల్లోని అన్నిస్థానాల్లో పోటీ

- లోక్ తంత్రిక్ జనతా దళ్ పార్టీ
- ఎన్నికల మేనిఫెస్టో, అభ్యర్థుల జాబితా విడుదల



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న లోక్ తంత్రిక్ జనతా దళ్ జాతీయ అధ్యక్షుడు జావేద్ రాజా, తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు రత్నం

పంజాగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో, ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నామని లోక్ తంత్రిక్ జనతా దళ్ జాతీయ అధ్యక్షుడు జావేద్ రాజా ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 273 పార్లమెంట్ స్థానాలు గెలిచి కేంద్రంలో తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. తమ పార్టీని కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ స్థాపించారన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు బి.రత్నం, నాయకులతో కలిసి ఎన్నికల మేనిఫెస్టోను, పోటీ చేయనున్న అభ్యర్థుల లిస్టును ఆయన విడుదల చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందిస్తామని, తెలుగు రాష్ట్రాల మధ్య, దేశ వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించి, రాజ్యాంగం కల్పించిన హక్కులను, ఆదేశిక సూత్రాలను అమలు చేస్తామన్నారు. తెలంగాణ తొమ్మిది పార్లమెంట్ స్థానాలు, ఏపీలో 13 పార్లమెంట్, 88 అసెంబ్లీ స్థానాలను మహిళలు, బీసీలకు ఇస్తామని అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే మూడో కూటమిని ప్రారంభిస్తామన్నారు. అర్హులైన ప్రతి యువకుడికీ ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, నిత్యావసర సరుకులు, పెట్రోలు ధరలను సగానికి తగ్గిస్తామన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్యవైద్యాన్ని అందిస్తామని, ఓటర్లను తిరిగి యజమానులుగా చేస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చలం, విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



మోత్కుపల్లి నర్సింహులును పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మోత్కుపల్లికి మందకృష్ణ పరామర్శ

అమీర్‌పేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సోమవారం పరామర్శించారు. లోక్‌సభ స్థానాల కేటాయింపులో మాదిగలకు జనాభా ప్రాతిపదికన టికెట్ల కేటాయింపు చేయాలని మోత్కుపల్లి నిరాహార దీక్ష చేపట్టి అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన నేపథ్యంలో మోత్కుపల్లి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపులో మాదిగలకు చేసిన అన్యాయం, అవమానంపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగింది. అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి ద్రోహం చేశారని ఆరోపించారు. మాదిగలకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటా కోసం కలిసి పోరాడతామన్నారు.

కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీని అరికట్టాలి



విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జూనియర్ కాలేజీలు, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణయ్య నాయకత్వంలో బీసీసంఘాల నేతలు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతి పత్రం అందజేశారు. ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. కార్పొరేట్ కాలేజీలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేసి పేదను దోచుకుంటున్నాయని ఆరోపించారు ఇంటర్మీడియట్‌కు రూ.3 లక్షల నుంచి రూ. 3.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. పాఠశాల స్థాయి విద్యకు రూ.3 లక్షల నుంచి 4 లక్షలు వసూలు చేస్తున్నారని వాపోయారు.

ఇంటర్‌తోపాటు నీట్, జేఈఈ, లాంగ్‌టర్మ్, షార్ట్ టర్మ్‌లకు కూడా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశామన్నారు. ఒక్క కాలేజీ, పాఠశాలకు పర్మిషన్‌తీసుకుని అదనంగా అనేక కాలేజీలు, పాఠశాలలు కొనసాగిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకముందే కాలేజీలు ముందస్తు అడ్మిషన్లు తీసుకుని కోట్లాది రూపాయలు దండుకుంటున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలల నిర్వాకం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కాలేజీలపై చట్టప్రకారం కేసులు నమోదు చేయకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు పెరిక సురేష్, నీల వెంకటేష్, రాజేందర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, రాందేవ్, చంద్రశేఖర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గానికి 306 బ్యాలట్ యూనిట్లు, 343 వీవీప్యాట్లు సోమవారం వచ్చాయి. వాటిని యూసుఫ్‌గుడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఉన్న స్ట్రాంగ్ రూంలలో అధికారులు భద్రపరిచారు.

- ఖైరతాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి)



ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

బంజారాహిల్స్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ ఆర్టిసన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2024 పేరిట ఏర్పాటుచేసిన సిల్క్ ఎగ్జిబిషన్ మహిళలను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ వస్త్రప్రదర్శనలో తెలంగాణ సంప్రదాయ రంగు రంగుల వస్త్రాలతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతోపాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాళ్లలో ప్రదర్శిస్తున్నారు. చేనేతకళాకారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశామని నిర్వాహకులు జయేషుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 25 వరకు కొనసాగుతుంది.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

- తన చావుకు తానే కారణమని సూసైడ్ నోట్
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన



గుగులోతు విజయ్(ఫైల్)

గరిడేపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, మిత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం లుంబాతండాకు చెందిన గుగులోతు బాలు కుమారుడు విజయ్(22) హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ డయాలసిస్ కోర్సు చేస్తున్నాడు. ఐదుగురు మిత్రులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లో రూం తీసుకొని ఉంటున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితులకు చెప్పకుండా బయటికి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు రూంలో చూస్తే బ్యాగు లేకపోవడంతో స్నేహితులు విజయ్ ఇంటికి ఫోన్ చేసి సమాచారం అందించారు. విజయ్ ఉదయం వరకు రాకపోయేసరికి ఆదివారం ఉదయం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి సుమారు 12గంటల ప్రాంతంలో విజయ్ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తన మృతికి ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాశాడు. తన రూంలోని స్నేహితులు, కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టొద్దని రాశాడు. 'నేను జీవితంలో ఏమీ సాధించలేనని, నా చావుకు నేనే కారణం' అని పేర్కొన్నాడు. అందులో తన తండ్రి, బంధువు, తన రూంమేట్స్‌కు సంబంధించిన మూడు ఫోన్ నంబర్లు రాసినట్లు స్నేహితులు తెలిపారు. సోమవారం ఉదయం మిర్యాలగూడ రైల్వే అధికారులు పోలీసులకు, ఉత్తరంలోని ఫోన్ నంబర్ల ఆధారంగా విజయ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి పంచనామా తర్వాత మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.




సర్కిళ్ల అధికారులతో జరిగిన సమావేశంలో సూచనలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్

ఎర్లీబర్డ్ ఆఫర్‌ను వినియోగించుకోవాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరు వరకు అందుబాటులో ఉన్న ఎర్లీ బర్డ్ ఆఫర్‌ను నగరవాసులు వినియోగించుకోవాలని, ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖాడే సూచించారు. సోమవారం ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో తమ పరిధిలోని అన్ని సర్కిళ్ల ఉపకమిషనర్లు, వైద్యాధికారులు, సహాయ కమిషనర్లతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సర్కిళ్ల వారీగా వసూలైన ఎర్లీబర్డ్ ఆస్థిపన్ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ యాక్షన్‌ప్లాన్‌లలో భాగంగా చెత్త కుండీలను పూర్తిగా తొలగించే విషయమై వైద్యాధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి బస్తీకి, గల్లీకి స్వచ్ఛఆటో టిప్పర్లు వెళ్లేలా చేయాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి



మృతుడు ఢిల్లీ కేశ్వరరావు

బోరబండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుడు నాలుగో అంతస్తుపై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్ వీడియో గల్లీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు డిల్లేశ్వరరావు(32) రోజూలాగే పనికి వెళ్లాడు. హెచ్‌ఎఫ్‌నగర్ లో నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి ఉన్న గోవను విప్పడానికి పైకి ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి భవన యజమానిపై చర్యలు తీసుకొని తన కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను కోరింది. ఆమె ఫిర్యాదు మేరకు 304 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



వేదికపై భావోద్వేగానికి గురైన కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితను ఓదారుస్తున్న బోర్డు మాజీ సభ్యురాలు బి.అనిత

మహిళా సదస్సులో భావోద్వేగం

- తండ్రి సాయన్న, చెల్లి లాస్యనందితలను తలచుకున్న నివేదిత

సికింద్రాబాద్, బోయినపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సిట్టింగ్ శాసనసభ్యురాలు లాస్య నందిత మృతితో జరుగుతున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నివేదిత సోమవారం రాత్రి ఇంపీరియల్ గార్డెన్స్‌లో జరిగిన మహిళా సదస్సులో భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి సాయన్న, చెల్లెలు లాస్య నందిత ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఉండగానే గతించడంతో తాము పడుతున్న క్షోభ అంతా ఇంతా కాదని కంటతడిపెట్టారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తమ కుటుంబానికి అండగా నిలబడ్డారని, తాము వారికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆమె భావోద్వేగానికి గురికావడంతో సభాప్రాంగణంలో నిశ్శబ్దం రాజ్యమేలింది. కాగా శాసనసభ్యులు సీహెచ్.మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డిలు మాట్లాడుతూ కంటోన్మెంట్‌కు దశాబ్దాలపాటు సేవలందించిన సాయన్న కుమార్తెను ఆశీర్వదించాలని మహిళలను కోరారు. బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గద్దర్ పేరిట అవార్డులు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన బిడ్డ వెన్నెలకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేయడం అటు గద్దర్ కుటుంబాన్ని, ఇటు యావత్ మహిళలను కూడా కించపరచినట్టేనన్నారు.



సీతాఫల్‌మండిలో ఓటర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, మహిళలు తదితరులు

ఓటు మనందరి బాధ్యత

- డీపీఓ శ్రీనాథ్

బౌద్ధనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటుహక్కు మన అందరి బాధ్యత అని జీహెచ్ఎంసీ డీపీఓ (యూసీడీ) శ్రీనాథ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సోమవారం సీతాఫల్‌మండిలో శ్రీదేవి నర్సింగ్‌హోమ్ వద్ద నిర్వహించిన ఓటర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీతాఫల్‌మండి నుంచి బౌద్ధనగర్ వరకు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీని నిర్వహించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వందశాతం ఓటింగ్‌ను పెంచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఓ ధనశ్రీ, ఆర్పీలు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



దక్షిణాసియా చాంపియన్‌షిప్స్‌కు హైదరాబాద్ అమ్మాయి కె.ధ్రుతి

ఆసియా ట్రయాథ్లాన్ పోటీలకు ధ్రుతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 27వ తేదీ నుంచి నేపాల్‌లో జరగనున్న ఆసియా ట్రయాథ్లాన్ కప్, దక్షిణాసియా చాంపియన్‌షిప్స్‌కు హైదరాబాద్ అమ్మాయి కె.ధ్రుతి అర్హత సాధించింది. గచ్చిబౌలిలోని శాట్స్ స్విమ్మింగ్ పూల్ అకాడమీలో 2013లో స్విమ్మర్‌గా కెరీర్ ప్రారంభించిన ధ్రుతి ఆతర్వాత సైక్లింగ్, అథ్లెటిక్స్‌లోకి ప్రవేశించింది. ఈ పోటీల్లో సత్తా చాటి, దేశానికి, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తానని ధ్రుతి తెలిపింది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



కార్తీక్ ఠాగూర్(ఫైల్)


సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత కారణాల వల్ల జార్ఖండ్ వాసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జెమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ - జెమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్‌ల మధ్య ఆదివారం రైలు పట్టాల సమీపంలో మృతదేహం పడి ఉందన్న సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుని జేబులో దొరికిన అడ్రస్ ప్రకారం.. మృతుడిని జార్ఖండ్‌కు చెందిన కార్తీక్ ఠాగూర్‌వాడిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైల్వే మాజీ అధికారి మృతి

చిలకలగూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య సికింద్రాబాద్‌లో రైల్వే అకౌంట్స్ విభాగంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వి.కృష్ణప్రసాద్ (72) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వివిధ హోదాల్లో సికింద్రాబాద్, లాలాగూడ, హైదరాబాద్, డివిజన్లలో పనిచేసి అనేక అవార్డులు అందుకున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ వర్క్స్(ఐసీడబ్ల్యూఏ) పూర్తి చేసి రైల్వేలో విధులు నిర్వహించిన అతి కొద్దిమందిలో ప్రసాద్ ఒకరిగా రికార్డు నమోదు చేశారు. ఆయన మృతికి రైల్వే అధికారులు పి.వెంకటేశ్వర్లు, అగంబర్‌రెడ్డి, దామోదర్‌ప్రసాద్. వి.ఎ.పద్మనాభం, మల్యాల శ్రీనివాస్ తదితరులు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించి, ఆయనతో గల అనుభవాలు గుర్తుచేసుకున్నారు.

హనుమాన్ జయంతికి భారీ ఏర్పాట్లు

- హనుమాన్ జయంతి వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయాలు, రహదారులు
- బందోబస్తుకు 300 మంది పోలీసులు
- దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు



హనుమాన్ జయంతి సందర్భంగా ముస్తాబైన తాడ్‌బంద్ ఆంజనేయస్వామి ఆలయం

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని జరుపుకోవడానికి భక్తులందరూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలో నిర్వహించనున్న శోభాయాత్రకు నగర పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. హనుమంతుని ఊరేగింపు శోభాయమానంగా ఉంటుంది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారు. ఈ క్రమంలోనే పోలీసులు భద్రత చర్యలను కట్టుదిట్టం చేస్తున్నారు.

నగరంలో జరిగే హనుమాన్ శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ముఖ్యంగా హనుమ జయంతి శోభాయాత్ర హైదరాబాద్ గౌలిగూడలో ప్రారంభమై సికింద్రాబాద్ తాడ్‌బంద్ దేవాలయం వద్ద ముగియనుంది. ఈ హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఇందుకోసం హనుమాన్ ఆలయంను అందంగా అలంకరించారు. తాడ్‌బంద్ దేవాలయం పురవీధులతో పాటు బోయినపల్లి, హస్మత్‌పేట్, దుబాయ్‌గేట్, వైష్ణవి దేవాలయం రోడ్లన్నీ కాషాయపు స్వాగత తోరణాలతో నిండిపోయాయి. ఈ వేడుకల కోసం 300 మంది ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తు ను పోలీసుశాఖ ఏర్పాటు చేస్తుంది. తాడ్‌బంద్ దేవాలయంలోని స్వామివారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు, ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్లు బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. ఈ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించడానికి సోమవారం ఆలయం వద్ద నార్త్‌జోన్ డీసీపీ రోహిణీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటుచేసి విస్తృతమైన భద్రతా ప్రణాళికను రూపొందించారు. శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలని, ఇతరప్రభుత్వ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో సమ్వయం చేసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలందరికీ మార్గదర్శకాలు చేశారు. పోలీసులు ఎప్పటికప్పుడు శోభయాత్రను పర్యవేక్షించనున్నారు. శోభాయాత్ర సజావుగా ముగియడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు అధికారులు వెల్లడించారు.

కనులపండుగలా సువర్చలా ఆంజనేయస్వామి కల్యాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్న విద్యాశంకర భారతి, ఆలయ ఈవో అంబుజా

ప్రసిద్ధి చెందిన సికింద్రాబాద్ తాడ్‌బంద్ వీరాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ ఈవో అంబుజా ఆధ్వర్యంలో మహాకుంభాభిషేక ప్రయుక్త హనుమత్ విజయోత్సవాలు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఏడు రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మహాకుంభాభిషేకం, నూతన ధ్వజ ప్రతిష్ఠ, నూతన ఉత్సవ విగ్రహమూర్తుల పూజలు ఎంతో వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో సువర్చలా ఆంజనయస్వామి శాంతి కల్యాణం అత్యద్భుతంగా నిర్వహించారు. మహాకుంభాభిషేకం, నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం జగద్గురు పుష్పగిరి పీఠాధీశ్వరులు విద్యాశంకర భారతిస్వామి చేతులమీదుగా భక్తిశ్రద్ధలతో వేదమంత్రాల సాక్షిగా మంగళవాయిద్యాల నడుమ భక్తుల జై శ్రీరామ్, జై జై శ్రీరామ్ నామస్మరణలతో జరిగాయి. అగ్నిహోమాలు, మహా హారతులు మంత్రపుష్పార్చన అన్నదానాలు చేశారు. మంగళవారం హనుమాన్‌జయంతిని పురస్కరించుకుని ఆలయంలోని మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి హనుమాన్ విజయోత్సవ విశ్వరూప దర్శనం కల్పించనున్నట్లు అదేవిధంగా ఉదయం 8 గంటలకు ఉష్ణవాహన సేవ, సాయంత్రం 7 గంటల నుంచి అశ్వవాహనం సేవను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో అంబుజా వెల్లడించారు. ముఖ్యంగా ఉత్సవాలలో పాల్గొంటున్న భక్తులు దేవాలయంకు సమర్పిస్తున్న విరాళాల రశీదు తీసుకోవాలని భక్తులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్‌కు ప్రజలే గుణపాఠం చెప్పాలి

- మైనంపల్లి హనుమంతరావు



రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మైనంపల్లి హనుమంత రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆలయ చైర్మన్ సి.సంతోష్ యాదవ్ అనుచరులు



రిటర్నింగ్ అధికారి డి.మధుకర్ నాయక్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ నారాయణన్

మారేడుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సి.సంతోష్‌యాదవ్ ఆదివారం రాత్రి ఓల్డ్ మారేడుపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సి.సంతోష్ యాదవ్‌ను, ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.... బీఆర్ఎస్ పార్టీకి ప్రజలే గుణపాఠం చెప్పాలని, గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట వసూలు చేసిన వారిని ఎన్నికల తర్వాత జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు. మారేడుపల్లిలో అర్హులకు ఇళ్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులు అమ్ముకున్నారని ఆరోపించారు. మధ్యవర్తిత్వంచేసి చాలామంది డబ్బులు వసూళ్లకు పాల్పడ్డారని ఆయన అన్నారు. అటువంటి వారిని వదిలిపెట్టమని, బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొల్లు కిషన్, మర్రి అమరేందర్‌రెడ్డి, సి.మల్లేష్ యాదవ్, ముప్పిడి గోపాల్, ఎస్.వెంకటేష్, వేణుగోపాలచారి, నర్సింగ్ రావు, రాజేష్, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓటు అడిగే హక్కు లేదు

జె.రామకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న జె.రామకృష్ణ

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఉప ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. సోమవారం కంటోన్మెంట్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా బీఆర్ఎస్ కంటోన్మెంట్ ప్రజలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కంటోన్మెంట్ ప్రజలను ద్వితీయశ్రేణి పౌరులుగా చూసిందని, కంటోన్మెంట్ పట్ల సవతి తల్లి ప్రేమ ప్రదర్శించిందని ఆరోపించారు. బీజేపీ తరఫున న్యాయ పోరాటం చేయడం వలన కేసీఆర్ సర్కారు అప్పట్లో దిగివచ్చి కంటోన్మెంట్‌కు రావలసిన టీపీటీ చార్జీల బకాయిలను కొంత మాత్రమే చెల్లించిందని పేర్కొన్నారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా న్యాయపరమైన చిక్కులు తలెత్తుతాయని భయపడి మరి కొంత బకాయిలను చెల్లించిందని రామకృష్ణ తెలిపారు. మల్కాజిగిరి లోక్‌సభ సభ్యునిగా ఉన్న కాలంలో అటు కంటోన్మెంట్‌కుగాని, ఇటు మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని ఇతర సెగ్మెంట్లకుగాని రేవంత్‌రెడ్డి ఒరగపెట్టిందేమీ లేదని అన్నారు. కంటోన్మెంట్ పాలకమండలి సమావేశాలకు సైతం రేవంత్‌రెడ్డి హాజరు కాలేదని, బోయినపల్లి శివార్లలో పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం మాత్రమే ఒకటి, రెండు సమావేశాలకు రేవంత్‌రెడ్డి హాజరయ్యారని తెలిపారు. ప్రధాని మోదీ సమర్థవంతమైన పాలన, బీజేపీ పట్ల రోజురోజుకూ పెరుగుతున్న ఆకర్షణతో కంటోన్మెంట్ ఉప ఎన్నికలో, మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం ఖాయమని రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌తో తార్నాకలో భారీగా ట్రాఫిక్ జామ్

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు

తార్నాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు తార్నాక ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి వాహనదారులను విస్తృతంగా తనిఖీలు చేపట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. తార్నాక నుండి హబ్సిగూడ వెళ్ళే ప్రధాన రహదారిలో కిలో మీటరు మేర ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్ళే సమయం కావడంతో వాహనదారులు తమ ఓపికలు నశించి ట్రాఫిక్ పోలీసులపై తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. ట్రాఫిక్ జామ్‌లు కాకుండా చర్యలు చేపట్టాల్సిన ట్రాఫిక్ పోలీసులే డ్రంక్ అన్ డ్రైవ్‌ల పేరుతో ట్రాఫిక్ జామ్‌లు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మందుబాబుల కోసం సాధారణ వాహనదారులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు.

రీసెర్చి మెథడాలజీపై ఓయూలో సదస్సు

తార్నాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో పీజీ నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు పరిశోధనా మెథడాలజీపై సోమవారం ఓయూలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెమినార్ హాల్‌లో ఒక్కరోజు సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీజీఆర్ఆర్‌సీడీఈ సంచాలకులు ప్రొ.జి.బి.రెడ్డి, ఐపీఈ అసోసియేషన్ అసోసియేట్ ప్రొ.కె.వి.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రామాణికమైన, వాస్తవికమైన ప్రాజెక్ట్ నివేదికలను తయారుచేయడంలో విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొ.గంగాధర్, విభాగాధిపతి ప్రొ.చెన్నప్ప, బీఓఎస్ చైర్‌పర్సన్ ప్రొ.కృష్ణ చైతన్య, సదస్సు కన్వీనర్ ప్రొ.కవితాదేవి, ప్రొ.నరేష్ రెడ్డి, ప్రొ.శేఖర్, డా. సంధ్యారాణి, డా. జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు, ఆటోలో నిద్రిస్తున్న వ్యక్తులే టార్గెట్

- స్నాచింగ్. దొంగతనాలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్
- రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1,600 నగదు స్వాధీనం

రాంనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాత్రివేళ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లు, ఆటోలలో నిద్రిస్తున్న వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను నల్లకుంట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక కత్తి, త్రిషూల్, బ్లేడ్, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నల్లకుంట పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓయూ ఏసీపీ జగన్, నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు, లాలాగూడ సీఐ రమేష్‌గౌడ్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. నగరంలోని బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో నివాసముంటున్న కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్ ముగ్గురూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. రాత్రివేళ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లు, ఆటోలలో నిద్రిస్తున్న వ్యక్తులను బెదిరించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, డబ్బులు, వారి వాహనాలను దొంగిలిస్తున్నారు. తద్వారా వచ్చిన డబ్బుతో ఎంజాయ్ చేస్తున్నారు. ఈనెల 13న ఎస్.నందకుమార్ అనే వ్యక్తి రాయదుర్గంలో గల ఆజుబా సాల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్నాడు. రాత్రి ఆయన మద్యం తాగి తన బైక్‌పై వస్తూ మెట్టుగూడ మెట్రో స్టేషన్ వద్దకు రాగానే బైక్ నడపడం వీలుకాకపోవడంతో బస్టాప్‌లో బైక్ పార్కింగ్ చేసి సెల్‌ఫోన్ జేబులో పెట్టుకుని పడుకున్నాడు.

కొంత సమయం తర్వాత నిద్రలేవగానే పార్కింగ్ చేసిన యాక్టివా, జేబులో సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 17న తెల్లవారుజామున నాలుగున్నర సమయంలో రమావత్ రాజు అనే వ్యక్తి నల్లకుంట మోడల్ రైతు చికెన్ బజార్ వద్ద ఫుట్‌పాత్‌పై పడుకున్నాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు యాక్టివాపై వచ్చి అతన్ని కత్తితో బెదిరించి అతని వద్ద నుంచి కీ ప్యాడ్, మొబైల్, రూ.3వేలు తస్కరించారు. ఆయన నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్ఐ కృష్ణ, క్రైమ్ సిబ్బందితో కలిసి బోరబండలో ముగ్గురు కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్‌లను పట్టుకున్నారు. ఈ ముగ్గురు 3 ఏళ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్నారని ఏసీపీ తెలిపారు. ఇందులో వెంకటస్వామి 16 నెలలు జైలుకు వెళ్లి వచ్చాడని, తిరిగి వచ్చిన వెంటనే దొంగతనాలు, స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడని తెలిపారు. ఎస్ఆర్‌నగర్, లాలాగూడ, నల్లకుంట, జీడిమెట్ల, కూకట్‌పల్లి పీఎస్‌ల పరిధిలో ఇలాంటి దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వీరిపై ఆర్మ్ యాక్ట్ కూడా నమోదు చేశామని తెలిపారు.

రాత్రిపూట ఫుట్‌పాత్, బస్టాప్, ఆటోలలో నిద్రించే వారు ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐలు కృష్ణ, శ్రీనివాసరావు, రమాదేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. వీరిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందికి రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ జగన్ ప్రకటించారు.

ప్రజలకు ఏం చేశారని మీకు ఓట్లు వేయాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ఎన్నికల ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఏంచేశారని మీకు ఓట్లేయాలో చెప్పాలని కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. అదేవిధంగా సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచార రథాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంద రోజులలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఆచరణ సాధ్యం కాని హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చెప్పాలంటే వందకుపైగా ఉన్నాయని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తాము చేసిన అభివృద్ధి ఒక్కటైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగిన మేలు, చేసిన అభివృద్ధి పనుల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో కార్పొరేటర్లు కొలన్‌లక్ష్మి, టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, హన్మంత రావు, ఆకులహరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, నాగులు, శ్రీకాంత్‌రెడ్డి, ఏసూరి మహేష్, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, రమణ, కూతురు నర్సింహ, గోపీలాల్ చౌహాన్, బాసాలక్ష్మి, లలితా చౌహాన్, నాగమణి, రాణీకౌర్ తదితరులు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



వారాసిగూడలో బైక్‌పై ఎన్నికల ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బైక్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

బౌద్ధనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్‌లో బీజేపీని గెలిపించాలని కోరుతూ అపార్టీ అభ్యర్థి, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి వారాసిగూడ, బౌద్ధనగర్, ఇందిరానగర్‌కాలనీ, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లో బైక్‌పై ర్యాలీని నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉమేష్ యాదవ్



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు ఉమేష్ యాదవ్

మారేడుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి డివిజన్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉమేష్ యాదవ్, మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఉమేష్ యాదవ్‌ను సాదరంగా ఆహ్వానిస్తూ ఈటల రాజేందర్ బీజేపీ కండువా కప్పారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె.రామకృష్ణ, భానుక మలికార్జున్, బీఎన్.శ్రీను పాల్గొన్నారు.



అడ్డగుట్టలో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డికి ఓటు వేయాలని వృద్ధురాలిని ఓటు అడుగుతున్న డప్పు మల్లికార్జున్

గాంధీ సూపరింటెండెంట్ ఔదార్యం

గురుకుల విద్యార్థులకు షూస్ అందజేసిన ప్రొఫెసర్ రాజారావు



సూపరింటెండెంట్‌ను కలిసిన గురుకుల పాఠశాల విద్యార్థులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వైద్య పరీక్షల కోసం గాంధీ ఆస్పత్రికి వచ్చిన గురుకుల విద్యార్థుల కాళ్లకు షూస్, చెప్పులు లేకపోవడాన్ని గమనించిన సూపరింటెండెంట్ షూస్ తెప్పించి ఇవ్వడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. వివరాలలోకి వెళితే.. సికింద్రాబాద్ బోయగూడకు చెందిన 13 మంది విద్యార్థినీ విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సంపాదించుకున్నారు. గురుకుల పాఠశాల నిబంధనల మేరకు విద్యార్థులు వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం గాంధీ ఆస్పత్రికి వచ్చారు. వీరిని గమనించిన సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు విద్యార్థులను దగ్గరికి పిలిపించి ఆయన తన చాంబర్‌కు తీసుకెళ్ళాడు. విద్యార్థులకు అప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఇప్పించి, బాగా చదువుకుని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని చెప్పారు. విద్యార్థుల కాళ్లకు చెప్పులు, షూస్ లేకపోవడంతో సూపరింటెండెంట్ వెంటనే అందరికీ షూస్, చెప్పులు తెప్పించి ఇచ్చారు. దీంతో విద్యార్థులు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



గురుకుల పాఠశాలల ప్రవేశ అర్హత పత్రాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు

గురుకుల పాఠశాలలో ప్రవేశం విద్యార్థుల అదృష్టం

- ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి

పద్మారావునగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం లభించడం విద్యార్థుల అదృష్టమని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికిగాను బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాలకు చెందిన 13మంది విద్యార్థులు ఇటీవల నిర్వహించిన తెలంగాణ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలో విజయం పాధించి, పలు పాఠశాలలలో అర్హత పొందారు. కార్యక్రమంలో హైస్కూల్ సాధన కమిటీ కోకన్వీనర్లు బి.నర్సింగరావు, వీ.జే.శేషగిరిరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.